## భానుడి భగభగ


నిర్మానుష్యంగా కరీంనగర్‌లోని తెలంగాణచౌక్

జగిత్యాల టౌన్/ ధర్మారం, మే 30: మళ్లీ భానుడు భగ్గుమంటున్నాడు. రోహిణీ కార్తెలో రోకండ్లు పగిలేలా దంచికొడుతున్నాడు. ఉదయం 9 గంటల నుంచే ప్రతాపం చూపుతున్నాడు. 11గంటల నుంచే మాడు పగుల కొడుతున్నాడు. మధ్యాహ్నం కల్లా నిప్పుల కొలిమిలా మారుతుండగా, రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారతున్నాయి. సాయంత్రం దాకా భగ్గుమంటుండగా.. గురువారం పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రత 46.7 డిగ్రీలు నమోదయ్యింది. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైనలో 45.8, కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో 45.4, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలో 44.00 డిగ్రీలు రికార్డయ్యాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే ఉండగా, ప్రజలు పొద్దంతా ఇండ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితులు నెలకొన్నాయి.

# మళ్లీ పెరిగిన కడుపు కోతలు

### జగిత్యాల జిల్లాలో 87 శాతం సిజేరియన్లే

- ఆరు నెలల్లోనే మారిన పరిస్థితులు
- పెరుగుతున్న సీ సెక్షన్ ఆపరేషన్లు
- పదేళ్ల కిందటి స్థితికి ప్రభుత్వ దవాఖానలు
- పర్యవేక్షణ లేక తగ్గిపోతున్న ప్రసవాలు
- 65 శాతం నుంచి 48 శాతానికి పడిపోయిన కాన్పులు
- క్రమంగా ప్రైవేట్‌లో పెరుగుతున్న డెలివరీలు
- డిసెంబర్ నుంచి ఏప్రిల్ మధ్యలో 52 శాతం ప్రైవేట్‌లోనే
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆరోగ్య నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు

*మళ్లీ కడుపు కోతలు పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో సీ సెక్షన్ ఆపరేషన్లు ఆందోళన కలిగిస్తున్నాయి. పదేళ్లపాటు ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించినా.. ఆరు నెలల నుంచి పరిస్థితులు మారిపోయాయి. పర్యవేక్షణ కరువై మళ్లీ ప్రైవేట్‌లో డెలివరీలు పెరుగుతుండగా, అందులోనూ ఎక్కువగా సిజేరియన్లే ఉంటున్నాయి. ఒక్క జగిత్యాల జిల్లాను చూస్తే.. గత డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకు ప్రైవేట్‌లో 1999 కాన్పులు అయితే.. అందులో 1706 ఆపరేషన్ల ద్వారానే కావడం పరిస్థితికి అద్దం పడుతున్నది. ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలను ప్రోత్సహించకుండా.. ఉన్నతాధికారులు చోద్యం చూడడం విమర్శలకు తావిస్తున్నది. తల్లీబిడ్డా క్షేమంగా ఉండాలంటే నార్మల్ డెలివరీలను ప్రోత్సహించాలని, కడుపుకోతలకు అడ్డుకట్ట వేయాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతున్నది.*



జగిత్యాల, మే 30 (నమస్తే తెలంగాణ): వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ అంచనాల ప్రకారం మానవ జాతికి ముఖ్యంగా మహిళలకు సాధారణ ప్రసవాలే మంచివి. ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాల్లో సాధారణ ప్రసవాలు అధికంగా ఉండగా, ప్రభుత్వాలు సైతం సాధారణ ప్రసవాలకే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నాయి. అయితే సాధారణ ప్రసవాలకు భిన్నంగా సెక్షన్ల ద్వారా ప్రసవాలు అధికంగా జరుగుతున్న దేశాల్లో భారత దేశం ఒకటి కాగా, అధిక ప్రసవాలు జరుగుతున్న ప్రాంతం తెలంగాణ రాష్ట్రం. ఇక తెలంగాణలో అత్యధికంగా ఆపరేషన్ల ద్వారా ప్రసవాలు నమోదవుతున్న ప్రాంతంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తల్లీబిడ్డల క్షేమానికి సాధారణ ప్రసవాలే ముఖ్యమని, ఆపరేషన్ల ద్వారా పుట్టే బిడ్డలకు, అలాగే ఆపరేషన్ల వల్ల తల్లులకు శారీరక రుగ్మతలు వస్తున్నాయని గతంలో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో స్వరాష్ట్రంలో కేసీఆర్ నేతృత్వంలో ఏర్పడిన తొలి ప్రభుత్వం ప్రసవాల కోసం చేస్తున్న ఆపరేషన్ల సంఖ్యను తగ్గించి, సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని నిర్ణయించింది. ఈ దిశగా చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని పలు చర్యలను చేపట్టింది. అమ్మలాలన పథకాన్ని ప్రవేశపెట్టి, ప్రభుత్వ దవాఖానల్లో ఉచితంగా ప్రసవం, పుట్టిన బిడ్డకు ₹12వేల ప్రోత్సాహకం, 13 వస్తువులతో కేసీఆర్ కిట్‌ను ఇచ్చింది. వీటితో పాటు ఆశా కార్యకర్తలకు లక్ష్యాలను నిర్దేశించి వారి పరిధిలో గర్భిణులను గుర్తించి వారిని ప్రభుత్వ దవాఖానలకు ప్రసవాల కోసం వచ్చేలా చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. అలాగే ప్రైవేట్ నర్సింగ్ హోంలపైనా ఆంక్షలు విధించింది. వీలైనంత వరకు సాధారణ ప్రసవాలు అయ్యేలా చూడాలని, విధిలేని పరిస్థితుల్లోనే సెక్షన్లు చేయాలని ఆదేశించింది. నర్సింగ్ హోమ్స్‌ల్లో కనీసం 30 శాతం ప్రసవాలు సాధారణ ప్రసవాలు ఉండాలని ఆదేశించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలు ఫలించాయి.

### ఎనిమిదేళ్ల క్రితం ప్రైవేట్‌దే హవా..

ఎనిమిదేళ్ల క్రితం జగిత్యాల జిల్లాగా ఆవిర్భవించిన ఏడాదిలో ప్రసవాల సంఖ్యను పరిశీలిస్తే ఆశ్చర్యం కలిగిస్తుంది. మొత్తం 7,257 ప్రసవాలు జరుగగా, అందులో 5,123 ప్రసవాలు ప్రైవేట్ దవాఖానల్లోనే నమోదయ్యాయి. కేవలం 2,134 ప్రసవాలు మాత్రమే ప్రభుత్వ దవాఖానల్లో జరిగాయి. అంటే 70 శాతానికిపైగా ప్రైవేట్‌లోనే నమోదయ్యాయి. అందులోనూ సాధారణ ప్రసవాలు ప్రైవేట్‌లో 573 కాగా, 4,550 ఆపరేషన్ల ద్వారానే జరిగాయి. ఇక ప్రభుత్వ వైద్యశాలల్లో 758 సాధారణ ప్రసవాలు కాగా, 1376 ఆపరేషన్లు అయ్యాయి. అంటే ప్రైవేట్‌లో 88 శాతం మేర ప్రసవాలు ఆపరేషన్ల ద్వారానే జరిగాయి.

### క్రమంగా సర్కారువైపు మొగ్గు

జగిత్యాల జిల్లాగా ఏర్పడిన తర్వాత ప్రసవాల విషయంలో మార్పు మొదలైంది. కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు, అప్పుడు తొలి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శరత్, జిల్లా ఉన్నతాధికారుల కృషి ఫలితంగా ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెరగడం మొదలైంది. 2017-18లో జిల్లా వ్యాప్తంగా 15,407 ప్రసవాలు జరిగితే.. ప్రభుత్వ దవాఖానల్లో 9,850 ప్రసవాలు (65 శాతం) నమోదయ్యాయి. 2018-19లో 12,110 ప్రసవాలు కాగా, 7,826 ప్రసవాలు (65 శాతం) గవర్నమెంట్‌లోనే జరిగాయి. 2019-20లో మొత్తం 13,005 ప్రసవాలు జరిగితే, ప్రభుత్వ దవాఖానల్లో 8262 జరిగాయి. 2020-2021లో 12,626 ప్రసవాలు జిల్లాలో జరుగగా, అందులో 6,576 ప్రసవాలు గవర్నమెంట్‌లోనే జరిగాయి. అయితే మహమ్మారి కరోనా టైంలో మాత్రం ప్రభుత్వ దవాఖానల్లో కొంత మేరకు ప్రసవాల సంఖ్య తగ్గిపోయింది. కరోనా అనంతరం ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్య కొంత మెరుగైనప్పటికీ, ప్రైవేట్‌లోనూ ప్రసవాల సంఖ్య పెరగడం ఆరంభమైంది.

### మళ్లీ ప్రైవేట్‌లో పెరిగిన డెలివరీలు

కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ప్రభుత్వ దవాఖానల్లో కొన్నేండ్ల పాటు ప్రసవాలు పెరుగుతూ వచ్చాయి. అయితే కొన్నాళ్లుగా మాత్రం ప్రసవాల సంఖ్య క్రమంగా తగ్గిపోతున్నది. 2022-23 సంవత్సరంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 52 శాతం ప్రసవాలు నమోదు కాగా, ప్రైవేట్ ఆసుపత్రుల్లో 48 శాతం ప్రసవాలు నమోదయ్యాయి. అయితే 2023 డిసెంబర్ నుంచి కాంగ్రెస్ సర్కార్ వచ్చినప్పటి నుంచి మళ్లీ ప్రైవేట్ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య, ఆపరేషన్ల సంఖ్య క్రమంగా పెరిగిపోతూ వస్తున్నది. గతేడాది డిసెంబర్‌లో ప్రభుత్వ దవాఖానల్లో 586 ప్రసవాలు కాగా, ప్రైవేట్‌లో 592 నమోదు అయ్యాయి. ఇక ఈ యేడాది జనవరి నుంచి మరింత పడిపోతున్నాయి. జనవరిలో ప్రభుత్వ దవాఖానల్లో 505 ప్రసవాలు నమోదు కాగా, ప్రైవేట్‌లో 513 జరిగాయి. ఫిబ్రవరిలో ప్రభుత్వ దవాఖానల్లో 412, ప్రైవేట్‌లో 439, మార్చిలో ప్రభుత్వ దవాఖానల్లో 424, ప్రైవేట్‌లో 452 ప్రసవాలు జరిగాయి. ఇక ఏప్రిల్‌లో ప్రభుత్వ దవాఖానల్లో 504 ప్రసవాలు నమోదు కాగా, ప్రైవేట్‌లో 595 నమోదయ్యాయి. మొత్తంగా డిసెంబర్ 2023 నుంచి ఏప్రిల్ వరకు ప్రభుత్వ దవాఖానల్లో 2431 ప్రసవాలు (48శాతం)జరుగగా, ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌ల్లో 2,591 ప్రసవాలు(52శాతం) నమోదయ్యాయి.

### ప్రైవేట్‌లో 87శాతం కోతలే

ప్రైవేట్‌లో ప్రసవాల్లో 87 శాతం కడుపుకోతల ద్వారానే జరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. జిల్లా ఏర్పడిన తర్వాత రెండు మూడేండ్ల పాటు ప్రైవేట్ దవాఖానలు అధికారుల భయానికి సాధారణ ప్రసవాల వైపు మొగ్గు చూపగా, తర్వాత కాలంలో మళ్లీ కడుపు కోతల వైపే మళ్లారు. ఇక కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మరింతగా పెరిగిపోయింది. గతేడాది డిసెంబర్, ఈ యేడాది ఏప్రిల్ వరకు ప్రైవేట్‌లో 1999 ప్రసవాలు జరుగగా, అందులో కేవలం 293 ప్రసవాలు మాత్రమే సాధారణ ప్రసవాలు కాగా, మిగిలిన ప్రసవాలన్నీ కడుపుకోతల ద్వారానే జరుగుతుండడంపై వైద్యరంగ నిపుణులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రైవేట్ దవాఖానల్లో జరిగే అనవసర కడుపుకోతలపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

### మన ఆత్మగౌరవానికి

# విఘాతమే

### చిహ్నాన్ని చెరిపేయడం తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీయడమే

- కాకతీయ తోరణం, చార్మినార్ రాచరికపు గుర్తులా..?
- గీతాన్ని మార్చడం చారిత్రక తప్పిదమే
- తెలంగాణలో సంగీత దర్శకులే లేరా
- కాంగ్రెస్ సర్కారు తీరుపై మండిపడుతున్న చరిత్రకారులు, సాహితీవేత్తలు, ఉద్యమకారులు
- సంస్కృతి విచ్ఛిన్నాన్ని సహించేది లేదని హెచ్చరిక



కరీంనగర్, మే 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాకతీయ కీర్తి తోరణం, చార్మినార్ వెయ్యేండ్ల సాంస్కృతిక వైభవానికి చిహ్నాలని, వెలకట్టలేని తెలంగాణ అస్తిత్వానికి నిలువెత్తు ప్రతీకలని చరిత్రకారులు, సాహితీవేత్తలు, ఉద్యమకారులు స్పష్టం చేస్తున్నారు. వాటిని చెరిపివేయాలని చూడడం తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీయడమేనని, మన ఆత్మగౌరవానికి విఘాతం కలిగించడమేనని తేల్చిచెబుతున్నారు. ఢిల్లీపై ధిక్కారానికి ప్రతీక అయిన కళాతోరణాన్ని, ప్రకృతి విపత్తుపై సాధించిన విజయానికి చిహ్నంగా నిర్మితమైన చార్మినార్‌ను తొలగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన పాలకులు రాజకీయాల కోసం చరిత్రను చెరిపేసే కుట్రలు చేయడం సరికాదని సూచిస్తున్నారు. తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బకొడుతూ.. తెలంగాణ చరిత్రకు సమాధి కట్టాలని కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తున్నదని మండిపడుతున్నారు. ఉద్యమ సమయంలో సీమాంధ్రపాలకులు తెలంగాణ సంస్కృతిని ఛిన్నాభిన్నం చేసినట్టే, స్వరాష్ట్రంలోనూ అదే విధ్వంసం కొనసాగడం దురదృష్టకరమని చెబుతున్నారు. రాజకీయాలను రాజకీయంగా ఎదుర్కోవాలి. కానీ, ఇలా విచ్ఛిన్నం చేయాలని చూడడం సరికాదని తప్పుపడుతున్నారు. ఇక 'జయ జయహే తెలంగాణ' పాటను మార్చడం చారిత్రక తప్పిదమే అవుతుందని కళాకారులు, రచయితలు, సంగీత దర్శకులు మండిపడుతున్నారు. అసలు తెలంగాణలోనే సంగీత దర్శకులు లేనట్టు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సినీ సంగీత దర్శకుడితో ఈ పాటను కంపోజ్ చేయించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మన పాటను మన మట్టిబిడ్డలతోనే పాడించాలనేది మన ఆత్మగౌరవని స్పష్టం చేస్తున్నారు. తన పాటకు సంగీతం చేసే కీరవాణిని తలదన్నే సంగీత దర్శకులు తెలంగాణాలో లేరని అందెశ్రీ అనడం బాధాకరమని సంగీత దర్శకుడు మల్లిక్ తేజ వాపోయారు. ఎన్నికల ముందు ఏడాది క్రితం నేను ఏమీ ఆశించకుండా ఒక్కరోజులోనే 'జయ జయహే తెలంగాణ' పాటకు రూపకల్పన చేశానని చెప్పారు. అప్పుడు ఈ పాటను మళ్లీ అద్భుతంగా చేసే అవకాశం వచ్చినప్పుడు 'నువ్వే చేస్తావు. మనమే కలిసి పని చేస్తాం' అని చాలా సార్లు అందెశ్రీ తనతో అన్నారని గుర్తు చేశారు. ఇప్పుడు మాత్రం మాటతప్పారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### చిహ్నం మార్చడం రేవంత్‌రెడ్డి తరం కాదు



రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొదటి కేబినెట్ మీటింగ్‌లో తెలంగాణ చిహ్నాన్ని మార్చేస్తామని అంటే నేను ఆనాడే అవివేకమని చెప్పిన. ఇది కరెక్ట్ కాదు అని ఖండించిన. రాష్ట్ర అధికార చిహ్నాన్ని మార్చడంపై ఆయన తరం కాదు. కేంద్ర ప్రభుత్వం పంపిన జీవో ప్రకారంగా ఇప్పుడున్న అధికారిక చిహ్నం ఆచరణలోకి వచ్చింది. కేంద్రం అనుమతి ఇస్తేగానీ దీనిని మార్చడానికి లేదు. వచ్చే నెల 2న అయ్యే పని మాత్రం కాదు. రాష్ట్రం నుంచి ప్రతిపాదన చేయాలి. కేంద్రం ఆమోదించాలి. అప్పుడే చిహ్నం మార్చడానికి అవకాశముంటుంది. అయినా రాష్ట్ర అధికారిక చిహ్నాన్ని ఎందుకు తొలగిస్తున్నాడో సరైన కారణాలు చెప్పాలి కదా..? కేవలం రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయని అంటున్నారు. అంటే భారత జాతీయ జెండాలో ఉన్న అశోక చక్రాన్ని కూడా తొలగించాలని రేవంత్‌రెడ్డి చెబుతున్నారా..? నాలుగు సింహాలున్న జాతీయ చిహ్నాన్ని తొలగించాలని చెబుతున్నారా..? దీనికి కాంగ్రెస్ పార్టీ జవాబు చెప్పాల్సిన అవసరం ఉన్నది.

– బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎంపీ


సమావేశంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్‌కుమార్, సుంకె రవిశంకర్

# వైభవంగా దశాబ్ది ఉత్సవాలు

- మూడు రోజులపాటు రాష్ట్ర అవతరణ వేడుకలు
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

కరీంనగర్ కార్పొరేషన్, మే 30 : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు స్పష్టం చేశారు. గురువారం కరీంనగర్‌లోని మాజీ ఎం పీ బోయినపల్లి వినోద్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ ఒకటిన జిల్లా నుంచి వెయ్యి మంది ముఖ్య నాయకులతో హైదరాబాద్‌కు వెళ్తామని, సాయంత్రం 5.30 గంటలకు గన్‌పార్క్ నుంచి సెక్రటేరియ ట్ ఎదురుగా ఉన్న అమర వీరుల స్తూపం వరకు ర్యాలీలో పాల్గొంటామని తెలిపారు. జూన్ 2న హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగే వేడుకల్లో పాల్గొంటామన్నారు. 3న కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లిలోని కేసీఆర్ భవన్‌లో జాతీయ జెండాతో పాటు బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తామని చెప్పారు. వీటితోపాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటామన్నారు. పద్నాలుగేళ్లు పోరాడి సాధించుకున్న తెలంగాణలో పదేళ్ల పాటు రాష్ట్రాన్ని కేసీఆర్ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారని కొనియాడారు. అన్ని ప్రాంతాల్లో వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, జ డ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్‌కుమార్, సుంకె రవిశంకర్, సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ మాజీ చైర్మన్లు పొన్నం అనిల్, ఏనుగు రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్రనాయకులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రామగుండం బీ థర్మల్ ప్లాంట్ పునరుద్ధరణ

జ్యోతినగర్, మే 30: రామగుండంలోని బీ థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఈనెల 20న ప్లాంటు బాయి లర్‌లోని సూపర్‌హీటర్ కాయిల్ ట్యూబ్ లీకేజీతో విద్యు దుత్పత్తికి అంతరాయం కలిగింది. పది రోజుల తర్వాత గురువారం ప్లాంట్‌ను పునరుద్ధరించి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. ప్లాంట్‌లో ట్యూబ్ లీకేజీతో ఒక్కసారిగా పెంట్ హౌస్ నుంచి వేడి బూడిద పైకి ఎగిసిపడడంతో అప్రమత్తమైన ఇంజినీర్లు యూనిట్‌ను ట్రిప్ చేశారు.

# కొండంత శోభితం


అంజన్న ఆలయ ప్రాంగణంలో ఇరుముడులతో దీక్షాపరులు


పట్టు వస్త్రాలతో ఆలయంలోకి వస్తున్న భద్రాద్రి, కొండగట్టు దేవస్థాన అధికారులు,అర్చకులు

- ఘనంగా హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలు ప్రారంభం
- అంజన్నకు భద్రాద్రి రామయ్య పట్టు వస్త్రాలు

మల్యాల, మే 30: కొండగట్టు అంజన్న సన్నిధిలో గురువారం హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలు వైభవంగా మొదలయ్యాయి. మూడు రోజుల పాటు వేడుకలు జరగనుండగా తొలిరోజూ రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అంజన్న దీక్షాపరులు, భక్తులతో కొండంతా కిటకిటలాడింది. అర్చకులు, వేదపండితులు మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు భద్రాద్రి ఆలయ ఈవో రమాదేవి, ఉప ప్రధాన అర్చకులు గోపాలకృష్ణాచార్యులు, అర్చకుడు అమరవాది వెంకట రాఘవన్ ఆంజనేయస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. వీరికి హనుమాన్ ఆలయ ఈవో ఆకునూరి చంద్రశేఖర్, ఉత్సవ ప్రత్యేకాధికారి వినోద్‌రెడ్డి నేతృత్వంలో భక్తులు ఎదుర్కోళ్లతో అపూర్వ స్వాగతం పలికారు. కళాకారుల కోలాటాలు, ఒగ్గుడోలు విన్యాసాలు, శివసత్తుల పూనకాల నడుమ భద్రాద్రి ఆలయ పట్టు వస్త్రాలను ఎదుర్కొన్నారు. అర్చకులు మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆశీర్వచన మండపంలో ఉత్సవమూర్తులను పల్లకీపై ఉంచి స్వస్తి వచనం, రక్షాబంధనం, రుత్విక్ వరణం, అరుణి మథనం తదితర పూజాది కార్యక్రమాలు చేశారు. పట్టువస్త్రాలు సమర్పించిన భద్రాద్రి ఆలయ అధికారులు, అర్చకులను హనుమాన్ ఆలయ కమిటీ ఘనంగా సత్కరించగా అర్చకులు పూజలు చేయించి తీర్థప్రసాద వితరణ చేశారు. ఉత్సవాల తొలి రోజే మాల విరమణ మండపాన్ని తెరిచారు. పెద్దసంఖ్యలో దీక్షాపరులు చేరుకొని దీక్షలను విరమించారు.

## ఎంపీవో వేధింపులు భరించలేకపోతున్నాం

### మంథని ఎంపీవోపై అదనపు కలెక్టర్‌కు పంచాయతీ కార్యదర్శుల ఫిర్యాదు

పెద్దపల్లి, మే 30 : మంథని ఎంపీవో ఆరిఫ్ హుస్సేన్ వేధింపులు భరించలేకపోతున్నామని గ్రామ పంచాయతీ కార్యదర్శులు గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ, డీపీవో ఆశాలతకు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఎంపీవో తమను అసభ్యకర పదజాలంతో దూషిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. అనంతరం వారు మాట్లాడారు. మండలంలోని 34 గ్రామ పంచాయితీలకు కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్నామని, ఎంపీవో గతేడాది కాలం నుంచి పంచాయితీ కార్యదర్శులను, ముఖ్యంగా మహిళా కార్యదర్శులను మానసికంగా వేధిస్తున్నారని తెలిపారు. వికృత చేష్టలు చేస్తూ బహుళ అర్థాలు వచ్చేలా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి అయ్యేదాకా ఫోన్లు చేస్తూ మానసిక వేదనకు గురి చేస్తున్నారని వాపోయారు. కార్యదర్శులను తన వ్యక్తిగత డ్రైవర్లగా వాడుకుంటూ ఆర్థికంగా, మానసికంగా తీవ్ర మనోవేదన గురి చేస్తున్నారని తెలిపారు. ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్న ఎంపీవోపై చర్యలు తీసుకోవాలని కోరారు.


మంథని ఎంపీవోపై ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వస్తున్న పంచాయతీ కార్యదర్శులు

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571